## బిజినెస్

# దేశంలో చక్కెర కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం

దేశంలో చక్కెర కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ డిమాండ్‌ను తీర్చేందుకు తగినంత చక్కెర నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఇథనాల్ ఉత్పత్తికి చక్కెర మళ్లింపు తగ్గిందని, ప్రస్తుత ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తి కారణం కాదని పేర్కొంది. 2022–23లో ఇథనాల్‌కు మళ్లించిన చక్కెర వాటా 12% కాగా, 2025–26లో అది 9%కి తగ్గిందని తెలిపింది. ప్రస్తుతం ధరల పెరుగుదలకు కారణం దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్‌కు ముందు డిమాండ్ పెరగడం, అధిక వర్షాలతో చెరకు పంట దెబ్బతినడం వంటి కారణాలున్నాయని వివరించింది. ప్రస్తుతం దేశీయ వినియోగానికి అవసరమైన చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది.



# స్థిరంగా బంగారం, వెండి ధరలు



హైదరాబాద్,

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు బుధవారం స్థిరంగా కొనసాగాయి. ఇటీవల వరుసగా హెచ్చుతగ్గులకు లోనైన పసిడి, వెండి ధరలు ప్రస్తుతం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతుండటంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,63,750గా కొనసాగుతోంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,100 వద్ద స్థిరంగా ఉంది. ఇక వెండి ధర కిలోకు రూ.2,65,000గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, దేశీయ డిమాండ్ వంటి అంశాల ఆధారంగా బంగారం, వెండి ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ రానున్న రోజుల్లో మార్కెట్ పరిస్థితులను బట్టి హెచ్చుతగ్గులు ఉండొచ్చని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నగరం, ప్రాంతాన్ని బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. అలాగే ఆభరణాల కొనుగోలు సమయంలో తయారీ ఛార్జీలు, జీఎస్టీ తదితరాలు అదనంగా వర్తిస్తాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

**ముంబై, ఆగస్టు 26**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో దేశీయ మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాలు అధికంగా నమోదయ్యాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 183.15 పాయింట్లు నష్టపోయి 77,472.94 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 126.80 పాయింట్లు పతనమై 24,207.75 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ఎక్కువ భాగం షేర్లు నష్టాల్లోనే ముగియడంతో సూచీలు రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్-30లో ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ తదితర షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ షేర్లు లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ముడిచమురు ధరల కదలికలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు వంటి అంశాలు రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.




## స్పోర్ట్స్

# నాలుగో రోజు గట్టిపోటీ ఇచ్చిన శ్రీలంక.. అయినా భారత్‌దే పైచేయి..!

**-కొలంబో టెస్టులో ముగిసిన 4వ రోజు ఆట**

**-రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఫాలో ఆన్ స్కోరు 229/6**

**-16 పరుగుల ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య జట్టు**



భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు శ్రీలంక ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503 పరుగులు చేయగా, 213 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం భారత్.. శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి లంక.. 229/6తో నిలిచింది. శ్రీలంక ఆధిక్యం 16 పరుగులుగా ఉంది. ఓవర్ నైట్ స్కోరు 265/8తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన శ్రీలంక కాసేపటికే ఆలౌట్ అయింది. 290 పరుగులకు పది వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్‌కు 213 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక్కడే భారత్‌కు ఫాలో ఆన్ ఆడించే అవకాశం వచ్చింది. కెప్టెన్ గిల్ ఏమాత్రం ఆలోచించకుండా లంకను ఫాలో ఆన్ ఆడించాలని నిర్ణయం తీసుకున్నాడు. దీంతో నాలుగో రోజే శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోని శ్రీలంకకు షాక్ తగిలింది. 5 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. 63 పరుగులకు రెండో వికెట్ కోల్పోయింది. దీంతో భారత్.. ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించేలా కనిపించింది. కానీ ఇక్కడే శ్రీలంక బ్యాటర్లు పోరాట పటిమ ప్రదర్శించారు. పసిందు సూరియబండార, కామిందు మెండిస్ హాఫ్ సెంచరీలతో మెరిశారు. మూడో వికెట్‌కు 115 పరుగులు జోడించారు. దీంతో శ్రీలంక 178/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. భారత్.. ఫాలో ఆన్ ఆడించి తప్పు చేసిందా అనే ప్రశ్న టీమిండియా ఫ్యాన్స్‌లో తలెత్తింది. కానీ ఇక్కడే భారత బౌలర్లు మళ్లీ అదరగొట్టారు. స్వల్ప వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టారు. దీంతో శ్రీలంక 218/6తో నిలిచింది. కాసేపటికే వర్షం ఎంట్రీ ఇచ్చింది. ఎంతకీ తగ్గకపోవడంతో నాలుగో రోజు ఆటను ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 229/6గా ఉంది. 16 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. ప్రస్తుతం క్రీజులో సోనాల్ దినూష (7బి), కేశర నువంత (3బి) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2 వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా, సారాంశ్ జైన్ తలా ఒక వికెట్ సాధించారు. ఐదో రోజు ఉదయమే మిగిలిన 4 వికెట్లను త్వరగా పడగొట్టి, చిన్న లక్ష్యాన్ని ఛేదించి సిరీస్ దక్కించుకోవాలని టీమిండియా భావిస్తోంది.

# బుమ్రాకు చెక్.. ఐసీసీ నం.1 టెస్ట్ బౌలర్‌గా 36 ఏళ్ల స్టార్క్..!

**-సీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ హవా**

**-16 ఏళ్ల కెరీర్‌లో తొలిసారి అగ్రపీఠం కైవసం**

**-అగ్రస్థానాన్ని కోల్పోయిన భారత స్టార్ బుమ్రా**



ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తన అంతర్జాతీయ కెరీర్‌లో సరికొత్త శిఖరాన్ని చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో మెక్కాయ్‌లో జరిగిన రెండో టెస్టులో 10 వికెట్లతో (6/12 & 4/39) సత్తాచాటిన స్టార్క్, ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. తన 16 ఏళ్ల కెరీర్‌లోనే తొలిసారి టెస్ట్ బౌలర్ల జాబితాలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. 36 ఏళ్ల వయసులో 16 ఏళ్ల కుర్రాడిలా రెచ్చిపోతూ.. అరుదైన రికార్డు కైవసం చేసుకున్నాడు. సుదీర్ఘ కాలంలో అగ్రస్థానంలో ఉన్న బుమ్రాను వెనక్కి నెట్టాడు.

పీఠం కోల్పోయిన జస్ప్రీత్ బుమ్రా

దాదాపు రెండేళ్లుగా ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్–1 స్థానంలో ఏకఛత్రాధిపత్యం చెలాయించిన భారత పేస్ గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా , ఈ తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయాడు. బుమ్రా సుమారు 700 రోజులుగా నంబర్ 1 టెస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. కానీ ప్రస్తుతం శ్రీలంకతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌కు గాయం కారణంగా బుమ్రా దూరమవ్వడం, మరోవైపు బంగ్లాదేశ్‌పై స్టార్క్ 10 వికెట్లతో విరుచుకుపడటంతో 10 రేటింగ్ పాయింట్ల ఆధిక్యంతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. స్టార్క్ ప్రస్తుతం 872 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. బుమ్రా 862 రేటింగ్ పాయింట్లకు పడిపోయాడు. న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక మొత్తంగా టెస్ట్ బౌలర్ల జాబితాలో టాప్–10లో ఏకంగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఉండటం గమనార్హం. ప్యాట్ కమిన్స్ (4), స్కాట్ బోలాండ్ (7), హేజిల్‌వుడ్ (9), నాథన్ లైయాన్ (10) ఈ జాబితాలో ఉన్నారు. ఇక భారత్ నుంచి బుమ్రా కాకుండా మరే బౌలర్ కూడా టాప్–10లో చోటు దక్కించుకోలేదు. మహమ్మద్ సిరాజ్ 18, రవీంద్ర జడేజా 19వ స్థానాల్లో ఉన్నారు. భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 28 స్థానాలు ఎగబాకి 48వ ర్యాంక్ సాధించాడు. ఇక బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ 6 స్థానాలు మెరుగుపరుచుకుని 7వ ర్యాంక్ సాధించాడు. కాగా 2010లో ఆస్ట్రేలియా తరఫున డెబ్యూ చేశాడు స్టార్క్. అప్పటి నుంచి నిలకడగా రాణిస్తూ ఆల్ ఫార్మాట్ ప్లేయర్‌గా మారిపోయాడు. ఇటీవల టీ20లకు గుడ్ బై పలికాడు. ఆసీస్ తరఫున కేవలం వన్డేలు, టెస్టులు మాత్రమే ఆడుతున్నాడు. ఇప్పటివరకు 107 టెస్టుల్లో 445 వికెట్లు, 130 వన్డేల్లో 247 వికెట్లు, 65 టీ20లలో 79 వికెట్లు స్టార్క్ పడగొట్టాడు.

# ధోనీ, సీఎస్కే మధ్య వాటా వివాదం!

**జట్టులో 25 శాతం వాటా కోరిన మహీ**

**5 శాతమే ఇస్తామంటున్న యాజమాన్యం?**



**చెన్నై**

: ఐపీఎల్‌లో అత్యంత ప్రజాకర్షణ కల్గిన జట్టుగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ వాటా కొనుగోలు చేస్తున్నాడా? కానీ మహీ డిమాండ్‌కు సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ఒప్పుకోవడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ లీగ్ ఆరంభ సీజన్ నుంచి చెన్నైకి ఆడుతున్న మహీ.. ఆ జట్టుకు ప్రధాన ఆకర్షణ. రికార్డు స్థాయిలో సూపర్‌కింగ్స్‌కు ఐదు ట్రోఫీలను అందించిన ఈ మాజీ కెప్టెన్.. జట్టులో తనకు వాటా కావాలని అడిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. జాతీయ మీడియా కథనాల ప్రకారం ధోనీ.. సీఎస్కేలో 25 శాతం వాటా కావాలని కోరగా ఫ్రాంచైజీ యాజమాన్యం మాత్రం 3 శాతమే ఇస్తానని చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో జార్ఖండ్ డైనమైట్ తన డిమాండ్‌ను 20 శాతానికి.. ఆ తర్వాత 18 శాతానికి తగ్గించుకున్నా చెన్నై మేనేజ్‌మెంట్ మాత్రం 5.5 శాతానికంటే ఎక్కువ ఇవ్వలేమని తెగేసి చెప్పినట్టు వినికిడి. సీఎస్కే ఓనర్లతో ధోనీకి ఆరంభం నుంచీ మంచి అనుబంధమే ఉంది. చెన్నై జట్టును ధోనీని విడదీసి చూడటం కూడా కష్టమే. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి మధ్య వాటాల వ్యవహారం ఎటు దారితీస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

